‘గోపాలమిత్ర’ల వేతన వెతలు

● గతేడాది అక్టోబర్ నుంచి అందని వైనం

నెక్కొండ : క్షేత్రస్థాయిలో పశువులకు వైద్యచికిత్స అందించే లక్ష్యంతో 2001లో నాటి ప్రభుత్వం ‘గోపాలమిత్ర’ పథకానికి శ్రీకారం చుట్టింది. పశు వైద్యశాలలకు దూరంగా ఉన్న పల్లెల్లో పశువులకు ప్రథమ చికిత్స అందించేందుకు గోపాలమిత్రలను నియమించింది. సీజన్‌లో పశు సంవర్ధక శాఖ నిర్వహించే వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాల్లో గోపాలమిత్రలు సహాయకులుగా సేవలు అందిస్తున్నారు. 2009లో నాటి సీఎం డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి గోపాలమిత్రలకు గౌరవ వేతనం రూ.2 వేలు చొప్పున అందించేందుకు నిర్ణయించారు. కాగా గతేడాది అక్టోబర్ నుంచి వేతనాలు అందించడం లేదు. ఈ క్రమంలో గోపాలమిత్రలు కుటుంబ పోషణలో ఇబ్బంది పడుతున్నారు.

వేతనాలు ఇలా..

వేతనాలు పెంచాలన్న నిరసనతో ప్రభుత్వం 2012లో గోపాలమిత్రల వేతనాన్ని రూ.3500లకు పెంచింది. స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం 2019 నవంబర్‌లో రూ.8500లకు పెంచారు. టార్గెట్‌ను పూర్తి చేస్తేనే జీతం అందుతుందన్నది నిబంధన. 50 శాతం పూర్తయితే రూ.5500, 75 శాతం పూర్తయితే రూ.6500, 90 శాతానికిపైగా టార్గెట్ పూర్తయితే రూ.8500 అందించారు. 2021లో పీఎఫ్‌తో కూడిన వేతనం రూ.11 వేల 50గా ప్రకటించారు.



విధులు ఇలా..

పశువులు అనారోగ్యానికి గురయితే రైతుల నుంచి సమాచారం అందిన వెంటనే గోపాలమిత్రలు పశువులకు ప్రథమ చికిత్స అందించి వైద్య సిబ్బందికి సమాచారం ఇస్తారు. పశు సంవర్ధక శాఖ వైద్య శిబిరాల్లో ముఖ్యపాత్ర పోషిస్తారు. పశు వైద్య సిబ్బందితో కలిసి పశువులు, మేకలు, గొర్రెలు ఇతర మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకా వేస్తారు. పశువులకు కత్రిమ గర్భధారణ (ఎద సూది) ఇస్తారు. సంకరజాతి, మేలుజాతి, జెర్సీ, ముర్రజాతి పశువుల అభివృద్ధికి కృషి చేస్తారు.

సమస్యలు పరిష్కరించాలి



అనేక ఏళ్లుగా సేవలు అందిస్తున్న క్రమంలో గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి. రైతు ఫోన్ చేస్తే వెంటనే పశువుల కొట్టం వద్దకు వెళ్లి సేవలు అందిస్తున్నాం. ఇప్పటికీ మూడు తరాల కృత్రిమ పశువులకు సంరక్షకులుగా ఉంటున్నాం. క్షేత్రస్థాయిలో పాడి అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలి.

– నల్లగొండ సమ్మయ్య, గోపాలమిత్ర

క్లుప్తంగా

ఎస్సైగా పదోన్నతి



వర్ధన్నపేట : స్థానిక ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సొన్నాయిల శ్రీనివాస్‌కు ఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయగా ఆయన ఏసీపీ అంబటి నర్సయ్యను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

స్కూళ్లలో ఆకస్మిక తనిఖీ



పర్వతగిరి : మండలంలోని పలు ప్రభుత్వ స్కూళ్లను ఎంఈఓ గాయపు లింగారెడ్డి, స్థానిక స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక రమేశ్ బాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంజాలకుంటతండా ప్రాథమిక పాఠశాలలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. గతేడాది ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉండగా ఈ ఏడాది కొత్తగా 11 మంది చేరడం పట్ల హెచ్‌ఎం ప్రమీలను అభినందించారు. ఏకోపాధ్యాయ పాఠశాల అయినప్పటికీ విద్యార్థుల సంఖ్య పెరిగిన క్రమంలో మరొక ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా పాఠశాలకు సర్దుబాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

ఆలయంలో పూజలు



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశాడ మాసం సందర్భంగా మహిళలు గోరింటాకు పెట్టుకుని పూజకు హాజరయ్యారు. అర్చకుడు వేణు పూజలు చేయించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జెల సదయ్య మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో శనివారం చేరారు. ఈ సందర్భంగా సదయ్యకు దయాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జ సంపత్ రెడ్డి, నాయకులు బైరి కుమారస్వామి, సయ్యద్ సోఫీ, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు అనుమతి ఇవ్వాలి



రాయపర్తి : ఈనెల 30న తలపెట్టిన ఉద్యమకారుల దీక్షకు అనుమతి ఇవ్వాలని ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఎనగందుల శ్యాంసుందర్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ముత్యం రాజేందర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్యాంసుందర్ మాట్లాడారు. ఎస్సైని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం మండల ప్రధాన కార్యదర్శి నాగండ్ల భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు సుదగాని వెంకటేశ్వర్లు, మాలోతు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

దుగ్గొండి : వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్లు, ట్రాక్టర్లు, బైక్‌లు, ఇతర ఏ వాహనమైనా నంబర్ ప్లేట్ లేకుంటే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. వాహనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రతాలు కలిగి ఉండాలని తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



అనిల్ (ఫైల్)

సంగెం : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలిలా.. మండలంలోని మొండ్రాయికి చెందిన నారగోని అనిల్ (42) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టగా 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగతా పనులకు డబ్బు సరిపోవేమోననే వేదనతో ఈనెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అనిల్‌ను ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా శనివారం మృతి చెందాడు.

మోహన్‌రావు జీవితం స్ఫూర్తిదాయకం

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : ప్రముఖ పారిశ్రామికవేత్త దొడ్డ మోహన్‌రావు జీవితం స్ఫూర్తిదాయకమని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని లింగగిరిలో శనివారం నిర్వహించిన సంతాప సభకు ఆయన హాజరై మోహన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడారు. నర్సంపేట ప్రాంత ప్రజలు గర్వించేలా దాతగా, పారిశ్రామికవేత్తగా మోహన్‌రావు ఎదిగారని తెలిపారు. స్వగ్రామ ప్రజల ఆకాంక్ష మేరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. గ్రామంలో శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయం, మాధన్నపేటలో శ్రీరామలింగేశ్వర ఆలయాలను నిర్మించి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వివరించారు. వైద్య కళాశాలకు 20 ఎకరాల స్థలాన్ని దానం చేశారన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

మొక్క నాటిన పెద్ది

మోహన్‌రావు జ్ఞాపకార్థం లింగగిరిలోని దొడ్డ లింగయ్య ఫంక్షన్ హాలు ప్రాంగణంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ అవార్డు గ్రహీత నల్లగొండ సమ్మయ్యతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మొక్క నాటారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ గుంటి రజని కిషన్, మాజీ కౌన్సిలర్ దార్ల రమాదేవి, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ బాల్నె వెంకన్న, మాజీ జెడ్పీటీసీ పత్తినాయక్, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, తదితరులు పాల్గొన్నారు.

‘ఓపెన్ టెన్త్, ఇంటర్’ను వినియోగించుకోవాలి



సంగెం : చదువును మధ్యలోనే ఆపేసిన వ్యక్తులు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను వినియోగించుకోవాలని అడల్ట్ ఎడ్యుకేషన్ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ అరుణశ్రీ కోరారు. శాంతి మండల సమాఖ్యలో అడల్ట్ ఎడ్యుకేషన్ అమలును ఆమె ఆధ్వర్యంలోని బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు సమాజాన్ని చైతన్యవంతం చేయాలని సూచించారు. వీఓ ఆధ్వర్యంలో సేకరించిన 60 మంది జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్ రమేశ్‌రెడ్డి, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్లు అహ్మద్, నాగేశ్వర్‌రావు, ఎంఈఓ రాము, ఏపీఎం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో ముందుండాలి

● ఏసీపీ రవీందర్‌రెడ్డి

నర్సంపేట : డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో విద్యార్థులు, యువత ముందుండాలని స్థానిక ఏసీపీ పున్నం రవీందర్‌రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలో ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ బాధ్యుడు ఎర్రబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడారు. యువత, విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకుండా సక్రమమైన మార్గంలో పయనిస్తూ చదువుల్లో రాణించి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగంపై 1908 లేదా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. ఎంఈఓ సారయ్య మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ నిర్మూలన పట్ల నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఏసీపీ రవీందర్‌రెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ బాధ్యులు బెజ్జంకి ప్రభాకర్, సభ్యులు రాము సేవక్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమేశ్, బుచ్చిరాములు, ఉమామహేశ్వర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ, తదితరులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నల్లబెల్లి : పత్రాలు అందిస్తున్న తిరుపతిరెడ్డి



ఖానాపురం : పత్రాలు అందిస్తున్న మురళి

నల్లబెల్లి : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. విడతల వారీగా నిర్మాణాన్ని బట్టి నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మాలోత్ రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, ఉపాధ్యక్షుడు పెంతల కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు మహేశ్, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకుడు బిక్కి మురళి అందించి మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ ఎల్లాగౌడ్, నాయకులు చాంద్ పాషా, సుదర్శన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ సేవలు మరువలేనివి

నర్సంపేట రూరల్ : దేశానికి మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు అందించిన సేవలు మరువలేనివని లక్నెపల్లి జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. పీవీ.నర్సింహారావు 104వ జయంతిని పురస్కరించుకుని నర్సంపేట మండలంలోని లక్నెపల్లిలోని పీవీ స్మారక భవన్‌లో ఆయన విగ్రహానికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, హెచ్‌ఎం శ్రీదేవి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆర్థిక సంస్కరణలతో దేశ వ్యవస్థను బలోపేతం చేసిన మేధావిగా కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

ప్రిన్సిపాల్‌కు గైడ్‌షిప్



నర్సంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్‌కు కాకతీయ విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగంలో పీహెచ్‌డీ గైడ్‌షిప్ లభించింది. ఈ మేరకు వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా నవీన్‌కు గైడ్‌షిప్ ప్రతం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌ను పలువురు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరిశోధక విద్యార్థులకు మెంటార్‌గా, సూపర్‌వైజర్‌గా సలహాలు, సూచనలు అందిస్తూ విద్యార్థులు పీహెచ్‌డీ పొందేలా కృషి చేస్తానన్నారు.

బాధిత మహిళలకు ‘సఖి’ సేవలు



కరపత్రాలను ప్రదర్శిస్తున్న తిరుమల, స్వప్న, తదితరులు

● కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న

వర్ధన్నపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న సఖి–వన్‌స్టాప్ సెంటర్‌లో బాధిత మహిళలకు, బాలికలకు ఉచితంగా అనేక సేవలు అందిస్తున్నట్లు కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న తెలిపారు. పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. సఖి కేంద్రాల్లో లభించే సేవలపై వివరించారు. విడిపోయే దంపతులకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు వరకట్న, లైంగిక, తదితర వేధింపులకు గురవుతున్న మహిళలకు ఉచితంగా న్యాయ, పోలీసు, తాత్కాలిక వసతి లభిస్తాయని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలకు స్వాంతన కల్పించడమే సఖి కేంద్రాల లక్ష్యమని చెప్పారు. అనంతరం సఖి సేవలకు సంబంధించిన కరపత్రాలను ప్రదర్శించారు. బాధిత మహిళలు 181, వృద్ధులు 14567, బాలికలు 1098కు ఫోన్ చేయాలని సూచించారు.

ఎన్నికల హామీలను నెరవేర్చండి



నర్సంపేట రూరల్ : వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నల్లబెల్లి : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

● ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నేత రాగసుధ

సాక్షి నెట్‌వర్క్ : గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను వెంటనే రద్దు చేయాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు వంగాల రాగసుధ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, ఇతర నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట, వర్ధన్నపేట, గీసుకొండ, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి, సంగెం, తదితర మండలాల్లో తహసీల్దార్లకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, తదితర ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం మోసపూరితంగా తాత్సారం చేస్తోందని విమర్శించారు. రుణమాఫీ చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని, అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు.

లేగ దూడల తరలింపుపై కేసు

గీసుకొండ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లేగ దూడలను తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పోలీసులు వరంగల్–నర్సంపేట రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టగా కోనాయమాకుల సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అనుమానాస్పదంగా నర్సంపేట వైపు నుంచి వరంగల్ దిశగా వెళ్తున్న గూడ్స్ వాహనం కనిపించింది. పోలీసులు తనిఖీ చేయగా లేగ దూడలను తరలిస్తున్నట్లు గుర్తించారు. ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో వాహన డ్రైవర్ బాదావత్ సింగ్యా, మహ్మద్ ముస్సేన్, మహ్మద్ అంకుశ్‌లపై కేసు నమోదు చేసి దూడలను గోశాలకు తరలించారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎన్నిక

రాయపర్తి : మండలంలోని మైలారం, బురహాన్‌పల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. మైలారంలో అధ్యక్షుడిగా బచ్చలి యాకయ్య, ఉపాధ్యక్షుడిగా చిర్ర రవి, ప్రధాన కార్యదర్శిగా లింగాల దిలీప్, కార్యదర్శిగా గాడిపెల్లి కుమారస్వామి, కోశాధికారిగా చిర్ర శ్రీధర్, ప్రచార కార్యదర్శిగా గబ్బెట ప్రవీణ్, సలహాదార్లుగా గాడిపెల్లి వెంకన్న, గబ్బెట యాకయ్య, చిర్ర దర్గయ్య, సభ్యులుగా యాకయ్య, చిర్ర రవి, తాటికాయల సంపత్, గాడిపెల్లి ఆగయ్య ఎన్నికవగా బురహాన్‌పల్లి కమిటీ అధ్యక్షుడిగా బాలె యాకయ్య, ఉపాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్య, కార్యదర్శిగా సురేశ్, సహాయ కార్యదర్శిగా శ్రీకాంత్, సలహాదార్లుగా బాలె హరీశ్, బాలె మల్లేశ్, కార్యవర్గ సభ్యులుగా కుమార్, రమేశ్, శ్రీను, బాలె యాదగిరి, చెరుపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

నల్లబెల్లి : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నాగెల్లి పవన్, ఉపాధ్యక్షుడిగా కనుకం శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి సిద్ధు, కార్యదర్శిగా సునీల్, సహాయ కార్యదర్శిగా పరికి శ్రీను ఎన్నికయ్యారు.

‘జెండా ఎగరేయాలి’

పర్వతగిరి : జూలై 7న గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ గోలి సుధాకర్ కోరారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట జెండా నిర్మాణానికి శనివారం ఆయన ముగ్గుపోసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, నాయకులు మాసాని గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విత్తన డీలర్లు నిబంధనలు పాటించాలి

● తహసీల్దార్ రమేశ్

ఖానాపురం : విత్తన డీలర్లు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ రమేశ్ కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన, ఎరువులు, పురుగుల మందుల డీలర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ–పాస్ మిషన్లతోనే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సిఫార్సుల మేరకు యూరియా, ఎరువులు వినియోగించాలని సూచించారు. రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, సర్టిఫైడ్ కంపెనీల నుంచి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని, గడువు మీరిన ఉత్పత్తులను తిప్పి పంపించాలని, తదితర సూచనలు చేశారు. సమావేశంలో ఏఓ బోగ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి

గీసుకొండ : మండలంలోని కోనాయిమాకుల రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఏఓ హరిప్రసాద్‌బాబు మాట్లాడారు. నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను ఎమ్మార్పీకే విక్రయించాలని తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీలను రైతులు కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్లైఫొసెట్ అక్రమంగా నిల్వచేసి అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఖానాపురం: మాట్లాడుతున్న తహసీల్దార్ రమేశ్

యూరియా దొరక్క ఇబ్బందులు

సంగెం : యూరియా దొరక్క ఇబ్బంది పడుతున్నామంటూ మండలంలోని గవిచర్ల రైతులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎదుట వాపోయారు. దయాకర్‌రావు గవిచర్ల మీదుగా వెళ్తుండగా ఆయనతో రైతులు కలిసి మాట్లాడారు. గత పదేళ్లలో లేని ఎరువుల కరువు వచ్చిందని, చెప్పులు పెట్టి లైన్‌లో నిలబడాల్సిన దుస్థితి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడారు. రైతులకు ఎరువులు సరఫరా చేయలేని అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం సరిపడా ఎరువులు, యూరియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు గూడ సుదర్శన్‌రెడ్డి, దొనికెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

గీసుకొండ : జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ కోరారు. మండల కేంద్రంలో మండల కార్యదర్శి తొగటి బ్రహ్మాచారి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో కుమార్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బషీర్ అహ్మద్, అంగన్‌వాడీ టీచర్స్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వీరగోని నిర్మల, ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు చినగారి రాణి, నాయకులు గున్నాల ప్రభాకర్, సంతోశ, భద్రి, రత్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నర్సంపేట : పట్టణానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి అన్నెబోయిన రాజేశ్ ఖన్నా ఊపిరితిత్తుల జబ్బుతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనకు వైద్యం కోసం ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ శనివారం రూ.60 వేల సాయం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, రాష్ట్ర గౌరవ సలహాదార్లు పులి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, తదితరులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిలో..

గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లికి చెందిన కూస రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్ రెడ్డి శనివారం రూ.5 వేల సాయం అందజేశారు. ఆయన పంపిన నగదును స్థానిక నాయకులు వీరగోని రాజ్‌కుమార్, అల్లం మర్రెడ్డి, గోనె మల్లారెడ్డి, తదితరులు బాధిత కుటుంబానికి అందజేశారు. తొలుత రాజయ్య చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు.

పట్టాలివ్వాలి

రాయపర్తి : రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ పేదలకు పోరంబోకు, అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలివ్వాలని తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల వెంకటసాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూభారతి చట్టం భూసమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. దళిత, గిరిజన, ఆదివాసీ కుటుంబాలకు పట్టాలిచ్చి రైతు బీమా వర్తింపజేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవన్నారు.

‘డీవీకే ఆలోచనలు ఆచరణీయం’

నర్సంపేట : విప్లవోద్యమానికి దుగ్గంపూడి వెంకటకృష్ణ (డీవీకే) ఆలోచనలు ఆచరణీయమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు తెలిపారు. డీవీకే మూడో వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన చిత్రపటానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. బాల్యం నుంచే అంచలంచెలుగా ఎదిగారని చెప్పారు. .

నివాళి

నల్లబెల్లి : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే కంభంపాటి లక్ష్మారెడ్డి సోదరుడు సుధాకర్‌రెడ్డి (68) శుక్రవారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు గందె శ్రీనివాస్ గుప్తా, దేవూ నాయక్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయండి

● రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్

గీసుకొండ : వ్యవసాయ రంగంలో మార్పులను సూచిస్తూ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అనంతారంలో సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి ‘రైతన్నా మేలుకో’ షార్ట్ ఫిలిం ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం దెబ్బతిన్నదని తెలిపారు. రైతులు పెట్టుబడి కూడా గిట్టుబాటు కాక ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయపాటి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా గద్దె రామారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, దండ ఆదినారాయణ, గద్దె నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.